

క్లాక్ టవర్ కూల్చివేతకు కుట్ర

దర్శికి తలమానికంగా ఉన్న గడియార స్తంభాన్ని కూల్చివేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. - 8లో..



ముగిసిన రెండో రౌండ్ పొగాకు కొనుగోళ్లు

కొండపి పొగాకు వేలం కేంద్రంలో రెండో రౌండ్ పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం 39 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ విధానాలు గందరగోళం


● ఏపీటీఎఫ్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు

ఒంగోలు సిటీ: గత ప్రభుత్వం 6 రకాల పాఠశాలలను ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం 8 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ విమర్శిస్తోందని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వి.జనార్దనరెడ్డి, డి.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవో రద్దు చేస్తామని, రెండు మాధ్యమాల ద్వారా విద్యాబోధన జరుగుతుందని హామీ ఇచ్చిన ప్రభుత్వం వాటిపై దృష్టి సారించకుండా గంటకొక విధానం చొప్పున నిర్ణయం తీసుకుంటోందని విమర్శించారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను, 6, 7, 8 తరగతులకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఒకటి, రెండు తరగతుల్లో ఫౌండేషన్ పాఠశాల పేరుతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలను తొలగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ

కొండపి: పెద్దకళ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ చెక్ పవర్‌ను పునరుద్ధరించినట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైకోర్టు ఉత్తర్వులు మేరకు పెద్దకళ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ గ్రామపంచాయతీ నిధుల డ్రాయింగ్ పవర్స్‌ను పునరుద్ధరించుతున్నట్లు పేర్కొన్నారు. కొండపి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ మాట్లాడుతూ కక్ష పూర్వకంగా సర్పంచ్ చెక్ రద్దు చేశారని, దీనిపై కోర్టుకు వెళ్లగా కోర్టు ఉత్తర్వుల మేరకు చెక్ పవర్‌ను పునరుద్ధరించారని తెలిపారు.

దగా డీఎస్సీ



మెగా డీఎస్సీ ప్రకటిస్తున్నామని ప్రభుత్వం ఆశలు రేపుతుండగా ఇది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మెగా డీఎస్సీతో ఎప్పటిలాగే ఊరించి ఉసూరు మన్పిస్తారా అన్న అయోమయంలో డీఎస్సీ అభ్యర్థులున్నారు. ఉమ్మడి జిల్లాలో 629 ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్ల పోస్టులు ఖాళీలు ఉన్నాయని ఆయా పోస్టులకు డీఎస్సీ ప్రకటించి పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

- డీఎస్సీలో చూపిన పోస్టుల భర్తీపై అనుమానాలు
- ఇది మెగా డీఎస్సీ కాదంటున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఆందోళనలో నిరుద్యోగులు
- ఇప్పటికే జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 222 మంది అధికం
- మెగా డీఎస్సీకి 629 పోస్టులకు పరీక్షలు
- ప్రభుత్వ లెక్కలు తప్పంటున్న విద్యార్థి సంఘాలు

ఒంగోలు, సిటీ:

జిల్లాలో ప్రస్తుత విధానం ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు వీటికి అదనంగా కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో 2,185 స్కూల్స్ ఉండగా వాటిలో ప్రాథమికోన్నత పాఠశాలలు 180, ఫౌండేషన్ పాఠశాలలు 195, ప్రాథమిక పాఠశాలలు 1,536, హైస్కూల్ ప్లస్ 20, హైస్కూల్స్ 1 నుంచి 10 వరకు 11, 3 నుంచి 10 వరకు 147, 6 నుంచి 10 వరకు 96 ఉన్నాయి. నూతన విధానంలో 2,185 పాఠశాలలు ఉండగా పాఠశాలల వారీగా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 987, ప్రాథమికోన్నత పాఠశాలలు 57, తక్కువ గ్రేడ్ బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 33, తక్కువ గ్రేడ్ మోడల్ ప్రైమరీ స్కూల్స్ 31, ఫౌండేషన్ స్కూల్స్ 255, హైస్కూల్స్ 224, బీపీఎస్ హైస్కూల్స్ 39, ఎంపీఎస్ హైస్కూల్స్ 12, మోడల్ ప్రైమరీ స్కూల్స్ 487, శాటిలైట్ స్కూల్స్ 2, బీపీఎస్ హైస్కూల్స్ ప్లస్ 5, ఎంపీఎస్ హైస్కూల్స్ ప్లస్ 53 ఉన్నాయి.

ఉపాధ్యాయుల మిగులు ఇలా..

ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల వివరాల ప్రకారం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 347కి గాను 269 మంది, ఎస్జీటీలు 5,111 కు గాను 4,684, ఎస్జీటీ ఉర్దూకు 136కు 113 మంది ఉన్నారు. అలాగే నూతన విధానంలో స్కూల్ అసిస్టెంట్లు తెలుగు 647కు 772 మంది, హిందీ 586కు 605 మంది, ఇంగ్లిషు 653 కు 789 మంది, లెక్కలు 711కు 850 మంది, ఫిజికల్ సైన్స్‌లో 596కు 581 మంది, బయాలజీ సైన్స్‌లో 609కు 573 మంది, సోషల్‌లో 641కు 595 మంది, వ్యాయామ ఉపాధ్యాయులు 588 కి గాను 463 మంది ఉన్నారు. ఈ ప్రకారం తెలుగు, ఇంగ్లిషు, హిందీ, లెక్కలులో 419 మంది ఉపాధ్యాయులు అధికంగా ఉండగా ఫిజికల్ సైన్స్, బయాలజీ సైన్స్, సోషల్, వ్యాయామ ఉపాధ్యాయులు 222 మంది తక్కువ ఉన్నారు.

ఖాళీల వివరాలు వాస్తవమేనా?

జిల్లాలో 629 పోస్టులకు మెగా డీఎస్సీ నిర్వహిస్తానని ప్రకటనలు జారీ చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి ఉపాధ్యాయ పోస్టులు కొన్ని విభాగాల్లో ఖాళీలు ఎక్కువగా, కొన్ని విభాగాల్లో తక్కువగా ఉంటే ప్రభుత్వం మాత్రం పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నట్లు ప్రకటించటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీలను, హైస్కూల్స్‌లో స్కూల్ అసిస్టెంట్లను వినియోగించాలని నిర్ణయించిందని ఆ ప్రకారం ఇప్పటి వరకు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన స్కూలు అసిస్టెంట్ల పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్లు అధికంగా ఉన్నారని మెగా డీఎస్సీ నిరుద్యోగుల పాలిట ఉత్తుత్తి డీఎస్సీ అన్న వ్యాఖ్యలు విద్యారంగ నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. దీనిని బట్టి కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేసేందుకు కుట్రలు పన్నుతుందో తెలుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి



జిల్లాలో మిగులుగా ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయులు 205 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లను త్వరగా కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేసి జూలై నాటికి 2025 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగులు ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

– సీహెచ్ ప్రభాకరరెడ్డి, ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉపాధ్యాయ లెక్కల్లో తిరకాసులు..

వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన పాఠశాలల ప్రకారం ఉండాల్సిన ఉపాధ్యాయుల వివరాలకు సంబంధించి చేస్తున్న ప్రకటనలు సత్యదూరమని టీచర్ల సంఘాలు విమర్శిస్తున్నాయి. నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునః ప్రారంభమై ఆగస్టు నాటికి విద్యార్థుల సంఖ్య నిర్ధారితమవుతుందని, ఆ ప్రకారం పాఠశాలలు, ఉపాధ్యాయ పోస్టుల లెక్కతేలుతుందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటిస్తున్న నూతన విధానం ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు బతికి బట్టకట్టే పరిస్థితి లేదని, కేవలం ప్రైవేటు పాఠశాలలకే ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆరోపిస్తున్నారు.

బీచ్ కబడ్డీ ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు ఎంపిక

చినగంజాం: బీచ్ కబడ్డీ ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు ఎంపిక కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. మే నెల 2 వ తేదీ నుంచి కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు అంతర్జాతీయ క్రీడాకారుడు, కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా నుంచి పోటీల్లో పాల్గొనే స్త్రీ, పురుషుల జట్లులకు ప్రయాణపు ఖర్చులు, ఇతర ఖర్చులు చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. చినగంజాం గ్రామంలో గత 15 సంవత్సరాలుగా స్వచ్ఛందంగా కబడ్డీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు మరపాల గిరిబాబు, క్లబ్ కార్యవర్గ సభ్యులను ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఎస్ చంద్రమోహన రెడ్డి, ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు, కార్యదర్శి వై పూర్ణచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, ట్రెజరర్ డీ రమేష్, బీ నాగాంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జట్టు ఇదీ..

గాలి లక్ష్మారెడ్డి, జీ సమరసింహారెడ్డి, జీ బాలకృష్ణారెడ్డి, కే వెంకటేష్, వై రాజశేఖర్ రెడ్డి, కే ప్రసాద రెడ్డి, బీ భరత్ రెడ్డి, కే హరిప్రసాద్‌రెడ్డి, కే రామాంజిరెడ్డి, జీ లక్ష్మారెడ్డి, పీ బ్రహ్మారెడ్డి, బీ సురేష్ రెడ్డి, ఎస్ ఉమామహేశ్వరరావు, పీ వినీత్ రెడ్డి, కే బ్రహ్మయ్య, కోచ్ యం గిరి బాబు, మేనేజర్ బోగిరెడ్డి నాగాంజనేయులు రెడ్డి.



బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలో తలపడుతున్న క్రీడాకారులు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



స్కౌట్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు

● స్కౌట్స్‌కు స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ శ్రీనివాసరావు పిలుపు

సంతనూతలపాడు: స్కౌట్ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం మూడో రోజు నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువ ఆపద మిత్ర స్కీమ్ కింద 18 నుంచి 40 సంవత్సరాల యువకులు శిక్షణ పొంది ప్రకృతి విపత్తుల సమయంలో సేవ చేసే అవకాశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో 41 పీఎం శ్రీ స్కూల్స్‌లో 38 మంది స్కౌట్ మాస్టర్లకు, 36 మంది గైడ్ కెప్టెన్లకు బేసిక్ కోర్సు ట్రైనింగ్ ఇచ్చామని, మొత్తం 108 యూనిట్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు 152 మంది బాలురకు స్కౌట్ పెట్రోల్ లీడర్స్‌గా 5 రోజుల ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ లీడర్లు పాఠశాలలో స్కౌట్స్‌ను బలోపేతం చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కార్యదర్శి తన్నీరు బాలాజీ మాట్లాడుతూ సామాజిక సేవకు వయసుతో నిమిత్తం లేదన్నారు. దేశం నాకేమిచ్చిందని కాకుండా దేశానికి నేనేమిచ్చాను అనే ఉద్దేశంతో దేశం కోసం ప్రతి స్కౌట్ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కౌట్స్ జిల్లా ట్రెజరర్ పి.వెంకటరావు, ట్రైనింగ్ మాస్టర్ కె.శేషారావు, ట్రైనింగ్ క్యాంప్ లీడర్లు నాగిరెడ్డి, వెంకటరెడ్డి, రాము, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీగా సుబ్బమ్మ ప్రమాణ స్వీకారం

యర్రగొండపాలెం: త్రిపురాంతకం ఎంపీపీగా ఆళ్ల ఆంజనేయరెడ్డి సుబ్బమ్మ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షత వహిస్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొంటారు.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు): బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులపై ఉందని సమగ్రశిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డితో కలిసి సీఎస్‌పురం, సి.నాగులవరం గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్తులు, బడిబయట పిల్లలతో చర్చించారు. ఈ సందర్భంగా మండలంలోని బడిఈడు పిల్లల వివరాలు, పాఠశాలకు హాజరయ్యేవారు, డ్రాపౌట్స్ వంటి వివరాలు సమీక్షించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో కూడా పేద విద్యార్థులకు సీట్లు కేటాయించి వారి ఫీజులను ప్రభుత్వం యాజమాన్యాలకు రీయింబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. ఆయన వెంట ఎంఈఓ రాజాల కొండారెడ్డి పాల్గొన్నారు.

ఈదురు గాలులకు అపార నష్టం



నేలమట్టమైన పొగాకు పందిళ్లు



కిందపడిన ట్రాన్స్‌ఫార్మర్



ప్రమాదకరంగా రోడ్డుకు అడ్డంగా పడిన విద్యుత్ స్తంభం, చెట్టు కొమ్మలు

గిద్దలూరు రూరల్: ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో మండలంలోని వెల్లుపల్లె, వెంగళరెడ్డి పల్లె, జయరాంపురం గ్రామాల్లోని పొగాకు, బొప్పాయి, అరటి తోటల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. 6 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ముండ్లపాడు ఏఈ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించారు. గాలివానతో పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సిమెంట్ దిమ్మెల మీద నుంచి కిందిపడిపోయాయి. దీంతో వ్యవసాయ బోర్లకు సంబంధించి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల పనులు సత్వరమే చేస్తామని ఏఈ తెలిపారు. గాలులతో వర్షం కురవడంతో కొన్ని ప్రాంతాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. వెల్లుపల్లె గ్రామానికి చెందిన వీరంరెడ్డి హనుమంతారెడ్డి రైతు పొగాకు పంట నేలకొరగడంతో సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లింది. 5 ఎకరాల పొగాకు పంటలో ఎండిన పొగాకును బేళ్లుగా కట్టేందుకు ఉంచిన పందిళ్లు పూర్తిగా నేలమట్టమై వర్షంతో పొగాకు తడిసి పనికి రాకుండా పోయిందని రైతు వాపోయాడు. విద్యుత్ స్తంభాలు, పెద్ద పెద్ద చెట్టు కొమ్మలు సైతం రోడ్లకు అడ్డంగా పడ్డాయి. ప్రభుత్వం నష్టపోయన వారిని ఆదుకోవాలని రైతులు కోరారు.

గరుడ వాహనంపై విష్ణుమూర్తిగా చెన్నకేశవుడు



స్వామివారి నగరోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అన్నా, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల

- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- నేడు చెన్నకేశవుని రథోత్సవం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి గరుడ వాహనోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు అలంకారంలో చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడోత్సవం రోజున శ్రీ మహావిష్ణువు అలంకారంలో చెన్నకేశవస్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. నగరోత్సవంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తల్లి కుందురు సుబ్బమ్మ, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, మాజీ ఆలయ చైర్మన్ పి.కేశవరావు, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, పురప్రముఖులు, అధికారులు, ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

నేడు రథోత్సవం:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారికి అత్యంత వైభవంగా రథోత్సవం సోమవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు రథోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని జయప్రదం చేయాలని కోరారు.



ఒంగోలు కొండపై ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రీస్తు పునరుత్థానం.. లోకానికి పర్వదినం



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి పునరుత్థానం చెంది..లోకానికి తన మహిమను చాటిన ఈస్టర్ పర్వదినాన్ని జిల్లాలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల క్రైస్తవ యువకులు రంగులు చల్లుకుంటూ, బాణసంచా కాల్చుతూ క్రీస్తు ప్రతిమలతో ఉత్సాహంగా ర్యాలీలు నిర్వహించారు. గతించిన తమ ఆత్మీయుల సమాధులను అలంకరించి వారిని స్మరించుకున్నారు. - 8లో

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


రామకృష్ణ మృతదేహం

కనిగిరిరూరల్: మద్యానికి బానిసైన యువకుడు, మానసిక స్థితి సరిగ్గా లేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని 9వ వార్డు వాల్మీకి వీధికి చెందిన మండ్లా కన్నయ్య కుమారుడు మండ్లా రామకృష్ణ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో మానసిక స్థితి కోల్పోయాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు గ్రావెల్ ట్రాక్టర్లు సీజ్

మద్దిపాడు: మండలంలోని పాత గార్లపాడు సమీపంలో నుంచి తెల్లబాడుకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్సై శివరామయ్య ఆదివారం ఉదయం సీజ్ చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు మైనింగ్ శాఖకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 8 మందికి గాయాలు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న రాముడు


దాడిలో గాయపడిన ధన్‌రాజ్

గిద్దలూరు రూరల్: పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు గొడవకు దిగడంతో 8 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొండపేట గ్రామ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం సమీపం వద్ద ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..ఓబురాయి ధన్‌రాజ్ అతడి అక్క సంజమ్మ కుమారుడు రాముడుల మధ్య గతంలో నుంచి వివాదాలు ఉన్నాయి. కుటుంబ సమస్యల నేపథ్యంలో ఆ విషయంపై కుల పెద్దలు కూర్చుని మాట్లాడుకునే సమయంలో వారి మధ్య తలెత్తిన వివాదంతో ఒకరినొకరు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో ధన్‌రాజ్, రాముడు, సంజమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ఐదుగురు కుటుంబ సభ్యులకు సైతం గాయాలయ్యాయి. అనంతరం వారిని తోటి బంధువులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఏరియా వైద్యశాలకు చేర్పించారు. సమాచారం అందుకున్న సీఐ కె.సురేష్ ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడిలో తీవ్రంగా గాయపడిన ధన్‌రాజ్, సంజమ్మ, రాముడులను మెరుగైన వైద్యం నిమిత్తం మార్కాపురం తరలించారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు


తప్పిపోయిన వ్యక్తితో ఎస్సై చౌడయ్య

యర్రగొండపాలెం: తప్పిపోయిన వ్యక్తిని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి అతని కుటుంబానికి అప్పచెప్పారు. వివరాల్లోకి వెళితే...యర్రగొండపాలెంకు చెందిన కుంజు శ్రీరాములు 2020 సెప్టెంబర్ 9వ తేదీన తప్పిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇటీవల కాలంలో ఎస్సై పి.చౌడయ్య ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి సమాచారం సేకరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో శ్రీరాములు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి సురక్షితంగా తీసుకొని వచ్చి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. ఈ కేసును ఛేదించేందుకు సహకరించిన పోలీస్ బృందానికి ఎస్సై అభినందించారు. ఐదేళ్ల క్రితం తప్పిపోయిన వ్యక్తిని తిరిగి తమకు అప్పచెప్పిన పోలీసులకు ఆయన కుటుంబ కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు


ఒంగోలులో ఊరేగింపులో ఏసుక్రీస్తు

ఈస్టర్ వేడుకలను ఆదివారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగరంలో భారీ ర్యాలీలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై క్రీస్తును ఊరేగించారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. జిల్లావ్యాప్తంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ మహిళలు భక్తిశ్రద్ధలతో క్రీస్తును ఆరాధించారు.

– సాక్షి, ఒంగోలు


కురిచేడు మండలం సింగరయ్యకొండలో ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


త్రిపురాంతకంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


చీమకుర్తి మండలం చీమలమర్రి బాప్టిస్ట్ చర్చిలో వాక్యం అందిస్తున్న దైవజనుడు గద్దల దేవసహాయం


సీఎస్ పురంలో దైవసందేశాన్ని అందిస్తున్న రెవరెండ్ ఫాదర్ నేరెళ్ల జగన్, పాల్గొన్న క్రైస్తవులు


ఒంగోలులో దైవసందేశం అందిస్తున్న పాస్టర్ అగస్టీన్


పొన్నలూరులోని టీబీసీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు


క్లాక్ టవర్ కూల్చివేతకు కుట్ర

- దర్శికి తలమానికంగా ఉన్న గడియార స్తంభం
- అడ్డం లేకున్నా.. రోడ్డు వెడల్పు పేరుతో తొలగింపునకు కూటమి చర్యలు
- 2001లో నిర్మించిన రోటరీ క్లబ్
- రోటరీలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఉండటమే తొలగింపునకు కారణం
- ముక్కున వేలేసుకుంటున్న స్థానికులు
- కూల్చడానికి లేదంటున్న రోటరీ క్లబ్ సభ్యులు

దర్శి (కురిచేడు): దర్శికి తలమానికంగా ఉన్న గడియార స్తంభాన్ని కూల్చడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. దర్శి నడిబొడ్డులో ఉన్న ఈ క్లాక్ టవర్‌ను రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ 2001లో పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అనుమతులతో నిర్మించింది. అప్పటి ఎస్పీ కుమార్ విశ్వజిత్, దివంగత ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆవిష్కరించారు. కింది వైపు ట్రాఫిక్ పోలీస్ ఐలాండ్ ఏర్పాటు చేశారు. నాలుగు వైపులా గడియారాలు ఏర్పాటు చేసి నిర్మించగా, దర్శి పట్టణానికి తలమానికంగా ఉంది. దర్శికి సింబల్‌గా గడియార స్తంభం ఫొటోను ప్రచురించడం కూడా ఆనవాయితీగా వస్తోంది. అటువంటి గొప్ప గుర్తింపును తొలగించేందుకు చర్యలు చేపట్టడాన్ని దర్శి పట్టణ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. దర్శిలో కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు నియోజకవర్గ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయనేందుకు గడియార స్తంభాన్ని తొలగించాలనుకోవడమే నిదర్శనంగా నిలుస్తోంది. కూటమి నేతల ఒత్తిళ్ల మేరకు దర్శి గడియార స్తంభాన్ని పడగొట్టేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

చంద్రబాబు పుట్టిన రోజే రాజకీయ కుట్రకు తెర...

సీఎం చంద్రబాబు పుట్టిన రోజునే గడియార స్తంభాన్ని తొలగించాలని రాజకీయ కుట్రకు తెరలేపారు. సాధారణంగా ట్రాఫిక్ రద్దీ ఉండి రోడ్డు వెడల్పు చేయాలంటే రోడ్డు పక్కన దుకాణాలు తొలగించి రోడ్డు వెడల్పు చేస్తారు. కానీ, రోడ్డు మధ్యలో ఉన్న గడియార స్తంభంపై కన్నేశారంటే.. ఇందులో రాజకీయ కుట్ర దాగి ఉందని రోటరీ క్లబ్ సభ్యులు ఆరోపిస్తున్నారు. అద్దంకి-పొదిలి-కురిచేడు-తూర్పువెంకటపాలెం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఈ గడియార స్తంభంపైన ఒకవైపు.. నిర్మాణం చేపట్టిన అప్పటి రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ రెడ్డి పేరు, మూడు వైపులా ట్రాఫిక్ పోలీస్ అనే పేరు ఉంటాయి. రోటరీ క్లబ్‌లో ఎక్కువ శాతం వైఎస్సార్ సీపీ మద్దతుదారులే ఉన్నారు. 1995లో రోటరీ క్లబ్ ఏర్పాటు చేసి 2000 సంవత్సరంలో గడియార స్తంభం నిర్మాణాన్ని ప్రారంభించారు. అన్ని అనుమతులతో 2001లో ప్రారంభించారు. అప్పటి నుంచి రోటరీ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు భారీ మొత్తంలో నిధులు వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్య శిబిరాలు, స్కూల్ విద్యార్థులకు బల్లలు, గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు, ఉచిత మంచినీటి చలివేంద్రాలు, పాఠశాలల్లో బోర్లు వేయించడం, కాలుష్య నివారణలో భాగంగా వినాయక చవితికి మట్టి విగ్రహాల పంపిణీ వంటి ప్రజలకు అవసరమైన సేవలు చేస్తూ జాతీయ స్థాయి అవార్డులు కూడా పొందారు. అలాంటి రోటరీ క్లబ్ నిర్మించిన క్లాక్ టవర్‌ను తొలగించాలనుకోవడం రాజకీయ కుట్రే అనే విమర్శలు వినిపిస్తున్నాయి.



క్లాక్ టవర్ నిర్మాణ సమయంలో పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతి పత్రం

ఫ్లెక్సీలకే పరిమితమవుతున్న క్లాక్ టవర్...

గతంలో ఈ క్లాక్ టవర్‌కు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి టవర్ కనిపించకుండా చేస్తున్నారని, ఎవరూ ఫ్లెక్సీలు కట్టవద్దని రోటరీ క్లబ్ సభ్యులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్లాక్ టవర్ కనిపించిన పాపాన పోలేదు. కట్టిన ఫ్లెక్సీలు ఊడదీయకుండా మళ్లీమళ్లీ కడుతున్నారు. అక్కడ గడియార స్తంభం ఉందన్న విషయం కనుమరుగయ్యేలా చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పుడు ఏకంగా క్లాక్ టవర్‌నే కూల్చివేయాలనే కుట్రలు చేయడంపై రోటరీ సభ్యులు మండిపడుతున్నారు. దీనికితోడు అక్కడ ఏర్పాటు చేసిన డివైడర్లకు సైతం పసుపు రంగు పూసి ప్రజల సొమ్ముతో పార్టీ ప్రచారం చేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, నగర పంచాయతీ, పోలీస్ అధికారులు రోటరీ క్లబ్ సభ్యులను పిలిచి మాట్లాడగా, తామెంతో ఖర్చు చేసి అన్ని అనుమతులతో నిర్మించిన క్లాక్ టవర్‌ను కూల్చవద్దని, రోటరీ క్లబ్ వల్ల ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేదని విజ్ఞప్తి చేశారు. దీంతో అందరి సమక్షంలో తమను మళ్లీ పిలిపించి మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పినట్లు రోటరీ క్లబ్ సభ్యులు తెలిపారు. కానీ, తొలగింపునకు రంగం సిద్ధం చేశారు.


దర్శిలోని క్లాక్ టవర్

ఇది రాజకీయ కుట్రే...

రోటరీ క్లబ్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎక్కువ మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, పార్టీ పదవులు పొందిన వారు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. వారి గుర్తులు గడియార స్తంభం సెంటర్‌లో ఉండటాన్ని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందని కొందరు రోటరీ సభ్యులు అంటున్నారు. కేవలం రాజకీయ కుట్ర కారణంగానే రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన క్లాక్ టవర్‌ను తొలగించాలని చూస్తున్నట్లు స్పష్టమవుతోందని చెబుతున్నారు. సేవా కార్యక్రమాలకు నెలవైన రోటరీకి పార్టీలను అంటగట్టి కూలదోయాలని అనుకోవడం అన్యాయమని రోటరీ క్లబ్ సభ్యులు మండిపడుతున్నారు. తమ సేవా కార్యక్రమాల గుర్తులు చెరిపివేయడం మంచి పద్ధతి కాదని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్లు వెడల్పు చేయాలనుకుంటే రోడ్డు చివరి దుకాణాలు అడ్డుగా ఉంటాయిగానీ.. రోడ్డు మధ్యలో ట్రాఫిక్ నియంత్రణకు అనుగుణంగా నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న రోటరీ క్లాక్ టవర్ ఎలా అడ్డవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక, అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి మరి.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చుండూరి రవిబాబు, లంకపోతు అంజిరెడ్డి

అల్లూరు (కొత్తపట్నం): వైఎస్సార్ సీపీ, వైఎస్సార్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో కొత్తపట్నం మండలంలోని అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన ఉపాస్ క్రికెట్ టీం–అల్లూరుకు చెందిన వైఎస్సార్ యూత్ ఫోర్స్ టీం మధ్య మొదటి మ్యాచ్ జరగ్గా, ఆయా టీంల సభ్యులను చుండూరి రవిబాబు, లంకపోతు అంజిరెడ్డి పరిచయం చేసుకున్నారు. మొదటిగా వారిద్దరూ క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. లంకపోతు అంజిరెడ్డి టాస్ వేసి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఆటల పోటీలు నిర్వహించి నిష్పక్షపాతంగా వ్యవహరించి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. చిన్న గ్రామాల్లో క్రికెట్ పోటీలు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. అంజిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేరుతో ఆటల పోటీలు నిర్వహించడం మంచి విషయమన్నారు. ఎలాంటి తేడాలు లేకుండా న్యాయంగా, ధర్మంగా పోటీలు నిర్వహించి గ్రామానికి, మండలానికి పేరు తీసుకురావాలని సూచించారు. రాబోయే రోజుల్లోనూ ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, హరిబాబు, మనోజ్, కిట్టు, వంశీ, మురళి, కోటి, క్రికెట్ యూత్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రెండో రౌండ్ పొగాకు కొనుగోళ్లు

- నేటి నుంచి ప్రారంభం కానున్న మూడో రౌండ్ పొగాకు వేలం
- దిగజారుతున్న ధరలు
- గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల వేడుకోలు


ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్(ఫైల్)

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారంతో రెండో రౌండ్ పొగాకు వేలం ముగిసింది. సోమవారం నుంచి మూడో రౌండ్ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. రెండో రౌండ్ వేలం ముగిసే నాటికి పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర రూ.230, సరాసరి ధర రూ.266.36గా నమోదైంది. ఇప్పటి వరకు 1.44 మిలియన్ల పొగాకు కొనుగోలు చేశారు.

ధరలతో రైతుల నిరాశ

వేలంలో ధరలపై రైతులు నిరాశ చెందుతున్నారు. బ్రైట్ రకం బేళ్లు అనుకున్నంత ధర లభించలేదని రైతులు వాపోతున్నారు. మూడో రౌండ్‌లో అయినా గిట్టుబాటు ధరలో పలికేలా ధరలు ఉండాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం పొగాకు ధరలు ఆశాజనకంగా లేవని, ఇలానే ధరలు పలికితే రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందంటున్నారు. గత సంవత్సరం రౌండ్ రౌండ్‌కు ధరలు పెరుగుతూ పోతే ఈ ఏడాది పొగాకు ధరలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని వాపోతున్నారు.

నిత్యం 100కి పైగా బేళ్లు వెనక్కి..

వేలం కేంద్రాల నుంచి ప్రతిరోజు 100కు పైన బేళ్లు వెనక్కి వెళ్తున్నాయి. రైతులు నాణ్యమైన బేళ్లను తీసుకువెళ్లినా గిట్టుబాటు ధర రాకపోవడంతో వాటిని వెనక్కి తీసుకువెళుతున్నారు. కొంతమంది రైతులు బ్రైట్ రకం పొగాకుకు సరైన మద్దతు ధర రాకపోవడంతో వేలానికి తీసుకుని రావడం లేదు. గత ఏడాది పోల్చుకుంటే ఈ సంవత్సరం ఖర్చులు భారీగా పెరిగాయి. ఖర్చులు పెరగడం పొగాకు ధర తగ్గిపోవడంతో రైతులు అయోమయ పరిస్థితిలో పడ్డారు. వ్యాపారులు తక్కువ ధరకు పొగాకు కొనుగోలు చేయడంతో ఒకానొక సమయంలో పొగాకు వేలాన్ని రైతులు బహిష్కరించారు. వేలం నిర్వహణాధికారి వ్యాపారులతో మాట్లాడి ధరలు తగ్గకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో తిరిగి వేలాన్ని కొనసాగించారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రైతులకు అండగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముందు చూపుతో పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు మార్క్ ఫెడ్‌ను రంగంలోకి దింపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో పొగాకు గిట్టుబాటు ధర లభించింది. బయ్యర్లు, దళారుల మాయాజాలంలో రైతులు చిక్కుకోకుండా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దిగడంతో ఊహించని ధరలు రైతులకు దక్కాయి. వ్యాపారులు సైతం పోటీపడి కొనుగోలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో రైతుల గురించి పట్టించుకోకపోవడంతో గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. ఇప్పటికైనా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.